క్లుప్తంగా

విద్యార్థి దశ నుంచే సేవా దృక్పథం అలవరచుకోవాలి

ఒంగోలు సెంట్రల్: విద్యార్థి దశ నుంచే సేవా దృక్పథం అలవరచుకోవాలని స్థానిక శ్రీ సరస్వతి విద్యాసంస్థల చైర్మన్ ఏవీ రమణారెడ్డి పిలుపునిచ్చారు. స్థానిక సరస్వతి (ఎస్ఎస్ఎన్) డిగ్రీ కళాశాలలో ఎన్ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యంలో ఆదివారం జాతీయ సేవా పథక (ఎన్ఎస్ఎస్) దినోత్సవం నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న చైర్మన్ మాట్లాడుతూ ఉన్నత విద్యనభ్యసిస్తున్న నేటి యువత.. సమాజసేవ పట్ల కూడా బాధ్యతగా వ్యవహరించాలని కోరారు. అనంతరం ప్రతిజ్ఞ చేశారు. ప్రిన్సిపాల్ శ్రీనివాసరావు, డైరెక్టర్లు పాల్గొన్నారు.

వాసవీ క్లబ్‌కు సేవా పురస్కారాలు



అవార్డులు అందుకున్న సంతనూతలపాడు వాసవీ, మహిళా క్లబ్‌ల సభ్యులు

చీమకుర్తి: సంతనూతలపాడులోని వాసవీ క్లబ్, మహిళా క్లబ్ తరఫున నిర్వాహకులు గతేడాది పాటు అందించిన సేవా కార్యక్రమాలకు వాసవీక్లబ్ రీజియన్ స్థాయిలో సేవా అవార్డులు అందించారు. ఆదివారం ఒంగోలులోని వైశ్యభవన్‌లో వాసవీ రీజియన్ పరిధిలోని 18 క్లబ్‌ల ఆధ్వర్యంలో డాన్ టు డెస్క్ కార్యక్రమంలో భాగంగా సంతనూతలపాడులో మెగా మెడికల్ క్యాంప్‌తో పాటు పలు సేవా కార్యక్రమాలు నిర్వహించినందుకు ఉత్తమ అవార్డులు ప్రకటించారు. రీజియన్ చైర్మన్ దర్శి చంద్రశేఖర్, వాసవీ ఇంటర్నేషనల్ క్లబ్ ఉపాధ్యక్షుడు శిద్దా సూర్యప్రకాష్, గోళ్ల వరలక్ష్మి చేతుల మీదుగా సంతనూతలపాడు క్లబ్‌ల అధ్యక్షులు బదరీనారాయణ, పద్మజ, జిల్లా ప్రతినిధులు వీఎస్ ప్రసాదరావు, జీఎల్ ప్రసాదరావు, కార్యదర్శులు శేషారావు, చంద్రావతి ఉత్తమ అవార్డులు అందుకున్నారు. ఈ సందర్భంగా సంతనూతలపాడు వాసవీక్లబ్, మహిళాక్లబ్ పాలకవర్గ సభ్యులను వాసవీ క్లబ్ రీజియన్ సభ్యులు అభినందించారు.

పోలేరమ్మ తల్లికి ప్రత్యేక పూజలు



భక్తులకు దర్శనమిస్తున్న పోలేరమ్మ తల్లి

మార్కాపురం టౌన్: పట్టణ శివారులో వెలసిన అల్లూరి పోలేరమ్మ ఆలయంలో అమ్మవారికి ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకుడు వెంకటేశ్వర్లు అమ్మవారికి ప్రత్యేక అలంకారాలు చేసి కుంకుమార్చన, అభిషేకాలు, పూజలు చేశారు. భక్తులు ఆలయ ప్రాంగణంలో పొంగళ్లు వండి అమ్మవారికి నైవేద్యంగా సమర్పించారు. ఏర్పాట్లను ఆలయ ఈఓ చెన్నకేశవరెడ్డి, ధర్మకర్తలు, ఆలయ సిబ్బంది శ్రీధర్‌రెడ్డి తదితరులు పర్యవేక్షించారు.

30లోగా ఇంటర్ ప్రైవేట్ విద్యార్థులు ఫీజు చెల్లించాలి

మార్కాపురం టౌన్: ఇంటర్మీడియెట్ ఫెయిలైన విద్యార్థులు ఈనెల 30 తేదీలోగా ఫీజు చెల్లించాలని స్థానిక సాధనా జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ కృష్ణారెడ్డి తెలిపారు. ఆదివారం కళాశాలలో ఏర్పాటు చేసిన ప్రెస్‌మీట్‌లో మాట్లాడుతూ.. ఈ ఏడాది ఇంటర్ ప్రథమ, ద్వితీయ సంవత్సరాల్లో ఫెయిలైన విద్యార్థులు 30వ తేదీలోగా ఫీజు చెల్లిస్తేనే 2024 మార్చిలో పబ్లిక్ పరీక్షలకు అర్హులవుతారని స్పష్టం చేశారు. సాధారణంగా ఇప్పటి వరకు రెగ్యులర్ విద్యార్థులతోపాటు ప్రైవేట్ విద్యార్థులకు కలిపి ఒకే తేదీని నిర్ణయించేవారని, ఈ ఏడాది నుంచి విడివిడిగా ఫీజు చెల్లించాలని ఆదేశాలు వచ్చాయని, విద్యార్థులు గమనించాలని సూచించారు.



ఒంగోలులో వినాయకుడి పూజల అనంతరం మాగుంట రాఘవరెడ్డిని సన్మానిస్తున్న తాతా ప్రసాద్, గోల్డ్ మర్చంట్స్ అసోసియేషన్ సభ్యులు



చీమకుర్తిలో వినాయక నిమజ్జనోత్సవంలో పాల్గొన్న మారం వెంకారెడ్డి

వీడ్కోలయ్యా గణపయ్యా..!

- కోలాహలంగా వినాయక విగ్రహాల నిమజ్జనం
- అట్టహాసంగా ఊరేగింపులు
- ఉత్సాహంగా పాల్గొన్న భక్తులు
- పోటాపోటీగా లడ్డూలకు వేలంపాటలు









ఒంగోలు నగరంలో గణపతి విగ్రహాల ఊరేగింపు

ఒంగోలు మెట్రో: వినాయకచవితిని పురస్కరించుకుని పలు ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన గణపతి విగ్రహాలకు ఆదివారం ఏడోరోజు ఊరేగింపులు, ప్రత్యేక పూజలు నిర్వహించి నిమజ్జనం చేశారు. ఒంగోలు నగరంలోని పలు వినాయక విగ్రహాలను కొత్తపట్నం సముద్రతీరానికి తరలించి బొజ్జ గణపయ్యకు వీడ్కోలు పలికారు. ఆదివారం కావడంతో భక్తులు భారీగా పాల్గొని ఊరేగింపులు, నిమజ్జనాలలో పాలుపంచుకున్నారు. గణపతి బప్పా మోరియా నినాదాలు మార్మోగాయి. కొత్తపట్నం సముద్రతీరం వినాయక విగ్రహాలు, భక్తులతో కిటకిటలాడింది. ఒంగోలు నగరంలోని వీధులన్నీ గణనాథుల ఊరేగింపులతో కోలాహలంగా మారాయి. యువతీ యువకులు రంగులు చల్లుకుని బాణసంచా కాల్చి డీజే సౌండ్ల నడుమ ఆనందోత్సాహాలతో నృత్యం చేశారు. స్థానిక సుజాతనగర్ మూడో లైన్‌లో ఏర్పాటు చేసిన వినాయకుని నిమజ్జనం సందర్భంగా సుమారు మూడువందల మందికి అన్నదానం చేశారు. మంగమూరు రోడ్డులో యువకులు పోటాపోటీగా గణనాథుని లడ్డూకు వేలం పాడారు. స్థానిక భక్తుడు చింతలూరి రంగనాయకులు రూ.23 వేలకు స్వామివారి లడ్డూను దక్కించుకున్నారు.

పూజలో పాల్గొన్న మాగుంట రాఘవరెడ్డి...

ఒంగోలు నగరంలోని గాంధీరోడ్డులో గోల్డ్ మర్చంట్స్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గణేష్ విగ్రహం వద్ద ఆదివారం నిర్వహించిన పూజలో ఎంపీ మాగుంట శ్రీనివాసులరెడ్డి తనయుడు మాగుంట రాఘవరెడ్డి పాల్గొన్నారు. స్వామివారి దీవెనలు అందుకున్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకుడు తాతా ప్రసాద్, గోల్డ్ మర్చంట్స్ అసోసియేషన్ సభ్యులు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించి స్వామివారి ఆశీసులు అందుకున్నారు.

నిమజ్జనోత్సవంలో పాల్గొన్న మారం వెంకారెడ్డి...

చీమకుర్తి: వైఎస్సార్ సీపీ అద్దంకి నియోజకవర్గ పరిశీలకుడు మారం వెంకారెడ్డి చీమకుర్తిలోని రెడ్డిబజార్లో ఆదివారం నిర్వహించిన వినాయక విగ్రహం నిమజ్జనోత్సవంలో పాల్గొన్నారు. స్వామివారికి పట్టువస్త్రాలు అందించి పూజలు చేశారు. స్వామివారి ఆశీర్వాదాలు స్వీకరించారు. అనంతరం నిమజ్జనోత్సవ ఊరేగింపులో మారంతో పాటు పోకూరి రామకృష్ణారెడ్డి, మారం వెంకటేశ్వరరెడ్డి, బడే దశరథరామిరెడ్డి, బడే అయ్యపరెడ్డి, పల్లకి సురేష్‌రెడ్డి, భాస్కర్‌రెడ్డి, స్థానికులు పాల్గొన్నారు.

గరికమిట్టలో రూ.73 వేలు పలికిన వినాయకుడి లడ్డూ...

చీమకుర్తి మున్సిపాలిటీలోని గరికమిట్ట 20వ వార్డులో వైఎస్సార్ సీపీ కౌన్సిలర్ గంగిరెడ్డి ఇందిర సుందరరామిరెడ్డి వినాయకుడి లడ్డూకు నిర్వహించిన వేలం పాటలో రూ.73 వేలకు దక్కించుకున్నారు. వినాయకుడి వద్ద పూజలందుకున్న లడ్డూను సుందరరామిరెడ్డి కుటుంబ సభ్యులు పోటీపడి దక్కించుకుని ఊరేగింపుగా ఇంటికి తీసుకెళ్లారు. వరుసగా గత 6 విడతలుగా వినాయకుడి లడ్డూను వేలం పాటలో గంగిరెడ్డి సుందరరామిరెడ్డి దక్కించుకోవడం విశేషం. కార్యక్రమంలో స్థానిక కౌన్సిలర్లు సోమా శేషాద్రి, మేకల యల్లయ్య, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు గంగిరెడ్డి ఓబుల్‌రెడ్డి, జేసీఎస్ కన్వీనర్లు చిన్నపురెడ్డి మస్తాన్‌రెడ్డి, మంచా హరికృష్ణ, స్థానిక నాయకులు పాల్గొన్నారు.



చీమకుర్తిలో రూ.73 వేలకు లడ్డూ దక్కించుకున్న కౌన్సిలర్ గంగిరెడ్డి ఇందిర సుందరరామిరెడ్డి











కొత్తపట్నం సముద్ర తీరంలో వినాయకుడి విగ్రహాలను నిమజ్జనం చేస్తున్న భక్తులు





స్వచ్ఛ ఒంగోలే లక్ష్యం

ఒంగోలు సబర్బన్: ఒంగోలు నగరాన్ని స్వచ్ఛంగా ఉంచడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నట్లు కమిషనర్ ఎం.వెంకటేశ్వరరావు తెలిపారు. స్వచ్ఛ హీ సేవా కార్యక్రమంలో భాగంగా నగరంలో ఆదివారం ర్యాలీ నిర్వహించారు. ఒంగోలు నగరపాలక సంస్థ కార్యాలయం నుంచి బయలుదేరిని ర్యాలీ.. రైల్వేస్టేషన్ వద్దకు చేరుకుంది. రైల్వేస్టేషన్ వద్ద స్వచ్ఛ హీ సేవా కార్యక్రమంపై ప్రయాణికులు, ప్రజలు, స్టేషన్ పరిసరాల్లోని వ్యాపారస్తులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి సంబంధించిన పాంప్లేట్లను పంచిపెట్టారు. అనంతరం గాంధీ పార్కులో జరిగిన కార్యక్రమంలో కమిషనర్ పాల్గొని స్వచ్ఛ హీ సేవ కార్యక్రమంలో భాగంగా నగరపాలక సంస్థ సిబ్బందిచే ప్రతిజ్ఞ చేయించారు. ఈ సంవత్సరం స్వచ్ఛతా హి సేవ కార్యక్రమాన్ని సెప్టెంబర్ 15 నుంచి నిర్వహిస్తున్నామన్నారు. అక్టోబర్ 2వ తేదీ వరకు అన్ని విభాగాలు సంయుక్తంగా నిర్వహిస్తాయన్నారు. అక్టోబర్ 2 స్వచ్ఛ భారత్ దివస్‌ను పురస్కరించుకుని కార్యక్రమాలు నిర్వహించాలన్నారు.



ఒంగోలు రైల్వేస్టేషన్ వద్ద స్వచ్ఛ హీ సేవా కార్యక్రమంపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్న కమిషనర్

జగనన్న సురక్షను విజయవంతం చేయాలి

ఒంగోలు రూరల్: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన జగనన్న సురక్ష కార్యక్రమాన్ని విజయవంతం చేయాల్సిన బాధ్యత ప్రతి ఒక్క గ్రామ కార్యదర్శిపై ఉందని ఒంగోలు ఎంపీడీవో పి.అజిత పేర్కొన్నారు. ఒంగోలు మండల గ్రామ కార్యదర్శులతో ఆదివారం ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఒంగోలు ఎంపీడీవో కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఇప్పటి వరకు నిర్వహించిన సర్వేలపై సమీక్షించారు. జగనన్న సురక్ష కార్యక్రమంలో భాగంగా ప్రతి గ్రామంలో ముగ్గురు డాక్టర్లతో కూడిన బృందం సర్వే ప్రకారం వైద్య పరీక్షలు నిర్వహించి తగిన సలహాలు, సూచనలు ఇవ్వనున్నట్లు తెలిపారు. ఇప్పటికే మెడికల్ క్యాంపుల షెడ్యూల్ విడుదల చేశామన్నారు. అన్నిశాఖల సచివాలయ సిబ్బంది పాల్గొనాలని స్పష్టం చేశారు. ముందుగా గ్రామంలో దండోరా వేయించి సమయం, స్థలం గురించి తెలియజేయాలని కోరారు. కార్యక్రమంలో పాల్గొనని మెడికల్ ఆఫీసర్, సిబ్బందిపై జిల్లా స్థాయి అధికారులకు ఫిర్యాదు చేస్తామన్నారు. ఇప్పటికే మండువవారిపాలెం, పాతపాడులో 104 వాహన సేవలను మెడికల్ ఆఫీసర్ అందించడంలేదని, పాల్గొనడంలేదని ఫిర్యాదులు వచ్చాయని, అటువంటి నిర్లక్ష్య ధోరణిని సహించేది లేదని హెచ్చరించారు.



ఎంపీడీవో సమీక్షలో పాల్గొన్న కార్యదర్శులు

‘మానవత’ నూతన కార్యవర్గం ఎన్నిక



నూతన కార్యవర్గ సభ్యులు

పొదిలి: మానవత స్వచ్ఛంద సంస్థ నూతన కార్యవర్గం ఏకగ్రీవంగా ఎన్నికైంది. తొలి సమావేశాన్ని ఆదివారం స్థానిక వెలిశెట్టి వెంకటేశ్వర్లు(శ్రావణి) అతిథి గృహంలో నిర్వహించారు. ఈ సందర్భంగా పలు అంశాలపై చర్చించి కార్యాచరణ ప్రణాళిక రూపొందించారు. నాలుగు విభాగాల కమిటీలను సంస్థ ప్రతినిధులు వెల్లడించారు.

డైరెక్టర్స్ బోర్డు

ముప్పాల పార్థసారథి(చైర్మన్), షేక్.నూర్జహాన్(వైస్ చైర్‌పర్సన్), కె.యల్లమందారెడ్డి(కన్వీనర్)

డైరెక్టర్స్ విభాగం

గునుపూడి చెంచు సుబ్బారావు, కాటూరి వెంకట నారాయణబాబు, వెలిశెట్టి వెంకటేశ్వర్లు, యక్కలి శేషగిరిరావు, యర్రం వెంకటరెడ్డి, వరికుంట్ల అనిల్

కార్యనిర్వాహక కమిటీ

కల్లం వెంకట సుబ్బారెడ్డి(అధ్యక్షుడు), బండి అశోక్(ఉపాధ్యక్షుడు), తానికొండ వెంకటరావు(కార్యదర్శి), భూమా సుమంత్(జాయింట్ సెక్రటరీ), సోమిశెట్టి చిరంజీవి(ట్రెజరర్), బీవీ రెడ్డి(ఎడ్యుకేటర్), గూడూరి వినోద్(హెల్త్), మేడా నరసింహారావు(ఎమర్జెన్సీ)

అడ్వయిజర్స్ బోర్డు

వాకా వెంకటరెడ్డి, సానికొమ్ము శ్రీనివాసరెడ్డి, సామంతపూడి నాగేశ్వరరావు, మాకినేని రమణయ్య, స్వర్ణగీత, గొలమారి చెన్నారెడ్డి, ధర్నాసి రామారావు, షేక్.యస్దాన్, షేక్.బాజీ కరీముల్లా.

నూతన కార్యవర్గం ఎంపిక



ప్రమాణ స్వీకారం చేస్తున్న సభ్యులు

ఒంగోలు సెంట్రల్: లయన్స్ క్లబ్ ఆఫ్ ఒంగోలు ఎలైట్ సిటిజన్ నూతన కార్యవర్గాన్ని ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. స్థానిక ఓ హోటల్లో నిర్వహించిన ఈ ఎన్నికలో నూతన అధ్యక్షునిగా సొల్లేటి వెంకట్, కార్యదర్శిగా బచ్చు సురేష్‌కుమార్, కోశాధికారిగా గ్రంధి పార్థసారథి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. నూతన కమిటీతో క్లబ్ మాజీ గవర్నర్ విజయ్‌చంద్, క్లబ్‌లో నూతనంగా జాయిన్ అయిన సభ్యులతో మల్టిపుల్ సెక్రటరీ బాలస్వామి ప్రమాణ స్వీకారం చేయించారు. లయన్స్ క్లబ్ మొదటి గవర్నర్ గోపీచంద్, రెండో గవర్నర్ హరిప్రసాద్, ప్రముఖ పారిశ్రామికవేత్త శిద్దా సురేష్, క్లబ్ ఫౌండర్ కూరపాటి రమేష్, పూర్వపు అధ్యక్షుడు పల్లపు సుబ్బయ్య, తమ్మినేని ఆంజనేయులు, పబ్బిశెట్టి జనార్దన్, సభ్యులు నైనాల రామకృష్ణ, పువ్వాడ రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.

వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు

వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు

శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు

అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.

99122 25431

ఒంగోలు డివిజన్

9010224456 90103 57744
90102 02762 90102 02856

Office mail : sakshiongads@gmail.com